

సమ్మతి పత్రాలు అందజేస్తున్న రైతులు

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త









కొడంగల్ అధికారులతో మాట్లాడుతున్న సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ

# పరిహారానికి పచ్చజెండా

✦ఫ్యూచర్ సిటీ ప్రధాన రహదారి భూసేకరణకు ముందడుగు

✦ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీకి అన్నదాతల ఆమోదం

✦రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లదని అదనపు కలెక్టర్ హామీ

**రంగారెడ్డి అర్బన్, జులై 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించనున్న ప్రధాన రహదారికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన భూ యజమానులు ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై అంగీకారం వ్యక్తం చేస్తూ తమ సమ్మతి పత్రాలను (కన్సెంట్ పిటిషన్లు) జిల్లా అధికారులకు అందజేశారు. దీంతో ఫ్యూచర్ సిటీ అనుసంధాన రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ మరింత వేగవంతం కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధ్యక్షతన మేడిపల్లి గ్రామ భూ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూసేకరణకు సంబంధించిన ప్రతి అంశాన్ని గ్రామస్తులకు సవివరంగా వివరించారు. భూముల విలువ నిర్ణయించే విధానం, పరిహారం చెల్లింపు ప్రక్రియ, చట్టబద్ధమైన నిబంధనలు, రైతుల హక్కులు, భూ యజమానులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, భూసేకరణ అనంతర ప్రక్రియ వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. అధికారుల వివరణల అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన చర్చలు సానుకూల వాతావరణంలో సాగాయి. భూముల సేకరణ విషయంలో తమ సందేహాలను అధికారులు నివృత్తి చేయడంతో పాటు పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వడంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం పట్ల అంగీకారం తెలుపుతూ భూసేకరణ ప్రక్రియకు సహకరిస్తామని పేర్కొంటూ తమ సమ్మతి పత్రాలను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం >>2

# భూ భారతి సర్కస్







## పగలు మొరాయిస్తున్న సర్వర్‌లు
## రాత్రి మాత్రమే బుకింగ్‌లు

- ఆఫీసుల చుట్టూ భూయజమానుల ప్రదక్షిణలు
- ఖరీఫ్ వేళ రైతులకు తప్పని తిప్పలు..
- చేవెళ్ల, శంకర్‌పల్లి, షాద్‌నగర్ పరిధిలో నిలిచిన లావాదేవీలు
- రంగారెడ్డి జిల్లాలో 200కు పైగా దరఖాస్తులు పెండింగ్
- నిరంతరాయంగా సర్వర్ నడిచేలా చూడాలని బాధితుల డిమాండ్

**రంగారెడ్డి అర్బన్, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు రంగారెడ్డి జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ భూముల కొనుగోలు, విక్రయాలు జరిగే చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాద్‌నగర్, కందుకూరు, ఆమనగల్లు, తలకొండపల్లి, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కొత్తూరు, మాడ్గుల, నందిగామ తదితర రూరల్ మండలాల్లో రిజిస్ట్రేషన్లు దాదాపు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు, భూ యజమానులు, కొనుగోలుదారులు రోజూ తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
కార్యాలయ సమయాల్లో భూభారతి సర్వర్ స్పందించకపోవడంతో దరఖాస్తుల పరిశీలన, వివరాల అప్లోడ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. అయితే, సాయంత్రం ఆరు గంటల తర్వాత నుంచి మరుసటి రోజు ఉదయం వరకు మాత్రమే సర్వర్ కొంత మేర పనిచేస్తుండటంతో, అప్పుడే రిజిస్ట్రేషన్ స్లాట్లను బుక్ చేసుకునే పరిస్థితి ఏర్పడింది. తీరా స్లాట్ బుక్ చేసుకుని మరుసటి రోజు కార్యాలయానికి వచ్చిన రైతులు, కొనుగోలుదారులు గంటల తరబడి వేచి చూసినా సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.
ఇటీవల ప్రభుత్వం పెంచిన మార్కెట్ విలువల ప్రకారం లక్షల రూపాయల స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించిన తర్వాత కూడా పని పూర్తికాకపోవడంపై దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించినా రిజిస్ట్రేషన్ జరగకపోవడం వల్ల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిపోతున్న పెండింగ్ దస్త్రాలు**
హైదరాబాద్ శివార్లలో వేగంగా అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో శంకర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాద్‌నగర్, కందుకూరు ప్రాంతాల్లో భూముల లావాదేవీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఫార్మ్హ ల్యాండ్లు, వెంచర్లు, పరిశ్రమల విస్తరణతో ప్రతిరోజూ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్న ఈ ప్రాంతాల్లో సర్వర్ సమస్యల కారణంగా మొత్తం వ్యవస్థ అస్తవ్యస్తమైంది.
జిల్లాలోని వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుతం 200కు పైగా రిజిస్ట్రేషన్ దరఖాస్తులు పెడింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రతిరోజూ కొత్త దరఖాస్తులు చేరుతుండటంతో ఈ పెండింగ్ మరింత పెరుగుతోంది. భూముల కొనుగోలు, విక్రయాలతో పాటు వారసత్వ మార్పులు, కుటుంబ విభజనలు, వ్యవసాయ భూముల బదిలీలు కూడా పూర్తిగా ఆలస్యమవుతున్నాయి.

**రైతులపై అదనపు భారం..**
రిజిస్ట్రేషన్లు పూర్తికాకపోవడంతో బ్యాంకు రుణాల మంజూరు, వ్యవసాయ పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడుతోంది. పలువురు రైతులు వ్యవసాయ పనులను వదిలి వారం రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పని కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ ఖర్చులు, సమయం >>2

# నాణ్యత లోపిస్తే మీదే బాధ్యత

- అభివృద్ధి పనులను వారానికోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేయండి
- చిత్తశుద్ధి ఉంటేనే గ్రామాల్లో సుపరిపాలన
- అధికారులకు సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ వార్నింగ్
- కొడంగల్ నియోజకవర్గంలో కలెక్టర్లతో కలిసి సుడిగాలి పర్యటన

**కొడంగల్, జులై 8ప్రభాతవార్త :** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులదే బాధ్యత అని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ హెచ్చరించారు. బుధవారం ఆయన కొడంగల్, దుద్యాల్, కోస్గి మండలాల్లో వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు దీపక్ తివారి, ప్రియాంకలతో కలిసి సుడిగాలి పర్యటన చేసి, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. దుద్యాల మండలంలోని ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులతో పాటు కొడంగల్‌లోని ఆర్అండ్‌బి అతిథి గృహం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం, జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, స్విమ్మింగ్ పూల్, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. పనులు పూర్తయిన భవనాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, ప్రజలకు సేవలు అందించేలా అన్ని వసతులు, పరికరాలు సమకూర్చాలని ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేసేందుకు మానవ వనరుల సామర్థ్యాన్ని పెంచి, రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు వారానికి ఒకసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. రోడ్లు, భవన నిర్మాణాల్లో క్వాలిటీ తగ్గితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేయాలని మున్సిపల్ >>2

# ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

## ఆన్‌లైన్ యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయండి: రైతులకు కలెక్టర్ దిశానిర్దేశం



శామీర్‌పేటలో ఆన్‌లైన్ కొనుగోళ్ల ప్రక్రియ విధానాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**శామీర్‌పేట, జులై 8, ప్రభాతవార్త :** జిల్లాలో పైలట్ ప్రతిపాదికన చేపట్టిన ఆన్‌లైన్ యాప్ ద్వారానే రైతులు ఎరువులను కొనుగోలు చేయాలని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్పష్టం చేశారు. బుధవారం శామీర్‌పేటలోని షేక్‌చాంద్ ఎరువుల దుకాణంను ఆకస్మికంగా తనిఖీచేశారు. రైతులు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ యాప్ పనితీరుపై ఆరా తీశారు ఆన్‌లైన ద్వారా రైతులు ఏ విధంగా ఎరువులను బుక్ చేసుకోవాలనే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రైతు ఈ యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 3,598 మెట్రిక్ టన్నుల ఎరువులను బుకింగ్ చేసుకోగా.. 753 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, మండల వ్యవసాయ అధికారి రమేశ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీనాథ్, మండలంలోని ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

## పారదర్శకత కోసమే

ఇక వ్యవసాయరంగ సేవలన్నీ ఫార్మర్ ఐడీ ద్వారానే..

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి అర్బన్,జూలై 8,ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా రైతులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును జిల్లాలో వంద శాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులుతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ప్రత్యేక యూనిక్ ఫార్మర్ ఐడీ పొందేలా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు నేరుగా గ్రామాల్లో అందుబాటులో ఉండి రైతుల వివరాలను నమోదు చేయాలని, నిర్ణీత గడువులోగా శాతం వంద నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియలో రైతుల ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి, బయోమెట్రిక్ లేదా ఓటీపీ ఆధారిత ఈకేవైసీ ద్వారా ధృవీకరణ పూరి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిరక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, పెట్టుబడి సహాయం, పంటల బీమా, ఎరువులు, విత్తనాల సబ్సిడీలు, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు తదితర సేవలు ఫార్మర్ ఐడీ ఆధారంగానే అందించే విధానం అమల్లోకి వచ్చే అవకాశమున్నందున ప్రతి రైతు తప్పనిసరిగా >>2





## రేపు స్కూళ్ల బంద్

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త ఆందోళన

స్టుడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ సతీష్‌కుమార్ పిలుపు





## ఉద్యమాన్ని ఊరూరికీ విస్తరిస్తాం

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ పోరాట సమితి

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మహిళల ధర్నా



సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

# ప్రతి ఊరూ ఆదర్శ గ్రామం అవ్వాలి

-అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ దిశానిర్దేశం

**వికారాబాద్, ప్రభాతవార్త :** సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు సమిష్టిగా కృషి చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బంట్వారం, ధారూర్, కొటపల్లి, మర్పల్లి, మొమిన్‌పేట్, వికారాబాద్, నవాబ్‌పేట్ మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు. గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వీబీ జి రామ్ జి పథకం, సెంట్రల్ ఫైనాన్సియల్ గ్రాంట్స్ యొక్క రూల్స్, ఘన వ్యర్థాల యొక్క నిర్వహణ రూల్స్, 2026, జల సిరి, ఇతర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ పథకాల గురుంచి అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు ఈ శిక్షణలో అన్ని జాగ్రత్తగా విని అన్ని గ్రామాల్లో నిబంధనలు అమలు పరిచి అన్నిటిని ఆదర్శ గ్రామ పంచాయతీలు గా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో తయారు చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి నీరజ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, పంచాయితీరాజ్ ఈఈ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల రసాలతో
# నాచురల్ వైన్

★యూట్యూబ్ చూసి తయారీ ★వృద్ధుడి వింత ఆలోచన
★ఏడాదిగా అక్రమ వ్యాపారం ★వైన్ ముఠా ఆటకట్టించిన డిటిఎఫ్ టీమ్..

**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** యూట్యూబ్‌లో చూసి వైన్ తయారీ నేర్చుకున్నాడు. వృద్ధాప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషణలో ఆంటోనీ పీటర్ అనే వ్యక్తి ఎక్సైజ్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా ఏడాదిగా వైన్ తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి డీటీఎఫ్ సీఐ భరత్ కుమార్, ఎస్సై శ్రీనివాసరెడ్డి సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి వైన్ తయారీ గుట్టురట్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు రకాల వైన్ తయారీ చేస్తు 750 ఎంఎల్ బాటిల్‌ను రూ.300 అమ్మకాలు జరుపుతూ ఆంటోనీ ఫీటర్ లాభాలను ఆర్జిస్తున్నట్లు డీటీఎఫ్ సీఐ తెలిపారు. గ్రేప్స్, ఫైనాఫిల్, జామా, మోసంబి, సపోట, బనాన, తమలాపాకు పేర్లతో వైన్‌ను తయారు చేస్తున్నాడు. పండ్లను నాచరల్‌గా 15 రోజుల పాటు ఫామింగ్ చేసి అందుల్లో పంచదార, గోదు మలు కలిపి వడ కట్టి వైన్‌గా తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నాడు. పండ్లను 15 రోజుల పాటు ఫామింగ్ చేస్తే అందులో పండ్ల రసంతో పాటు అల్కహాల్ కూడ వస్తుంది. ఈపద్ధతిలో తయారు చేసిన వైన్‌ను నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ ఎన్‌హెచ్‌ఓ కాప్రా ప్రాంతాల్లో అమ్మకాలు జరుపు తున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. ఈ దాడిలో 377.7 లీటర్ల వైన్‌ను, 502 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వైన్ విలువ రూ. 1.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఎక్సైజ్‌శాఖ ఆదాయనికి గండికొడుతున్న వైన్ ముఠా గుట్టురట్టు చేసిన డీటీఎఫ్ టీమ్‌ను మా ల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ప్రణవి, ఈఎస్ బి. హన్మంతరావు అభినందించారు. పట్టుకున్న వైన్‌ను, నిందితుడిని కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వైన్, చిత్రంలో నిందితుడు ఆంటోనీ పీటర్



✦పోలీస్ స్టేషన్ స్థలంలో ఆక్రమణలు నేలమట్టం

✦కబ్జాదారుల వ్యూహాలకు హైడ్రా చెక్

✦చైతన్యపురిలో అధికారుల సంచలనం

# రక్షకభట నిలయ స్థలానికే రక్షణ

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** రక్షక భట నిలయానికి కేటాయించిన స్థలానికే రక్షణ కరువు కావడంతో, రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణలను ముక్కుమ్మడిగా కూల్చి వేశారు. నగరంలో చెరువులు, ప్రబుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు ప్రబుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన కట్టడాలపై హైడ్రా అధికారులు ఎట్టకేలకు కొరడాఝుళిపించారు. రహదారి పక్కన ఉన్న ప్రబుత్వ భూమిని హైడ్రా తన ఖాతాలో వేసుకుంది. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రబుత్వ స్థలాన్ని కొందరు తప్పుడు పొత్రాలతో స్థలాన్ని కాజేయడానికి వ్యూహరచన చేయగా దాన్ని హైడ్రాధికారులు ఛేదించారు. సుమారు రూ.14 కోట్ల విలువచేసే ప్రబుత్వ భూమిని కాపాడే విషయంలో హైడ్రా, రెవెన్యూ, పోలీసు అధికారులు పెద్దఎత్తున మొహరించారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రూ.14 కోట్ల విలువచేసే 700గజాల ప్రబుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైడ్రా ఏసీపీ ఉమామహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ నరసింహ, తహసీల్దార్ హేమమాలిని, చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్ మండల రెవెన్యూ పరిధిలోని కొత్తపేట నాగోల్ రహదారి పక్కన ఉన్న పోలీస స్టేషన్ కోసం కేటాయించిన ప్రబుత్వ స్థలాన్ని సర్వే నంబర్ 135లో ఉన్న సుమారు 700 గజాల విలువైన ప్రబుత్వ భూమిని గత 2007వ సంవత్సరంలో రెవెన్యూ శాఖ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణం కోసం అధికారికంగా కేటాయించి అందులో పోలీస్‌స్టేషన్ బోర్డును కూడా ఏర్పాటు చేసి స్థలం చుట్టుపక్కల ఫినిషింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు పక్కనే నిత్యం రద్దీగా ఉండే ఈ స్థలంపై కన్నేసిన కొందరు స్థానిక కబ్జాదారులు దాన్ని ఆక్రమించి గుడిసెలు, తాత్కాలిక షెడ్లు నిర్మించుకున్నారు. రక్షక భట నిలయ స్థలంలోనే యథేచ్ఛగా వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వ హిస్తూ ప్రబుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు. బుధవారం రెవెన్యూ, హైడ్రా, పోలీసుల బృందం పెద్దఎత్తున ఆ ప్రాంతానికి చేరుకొని ప్రబుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను పూర్తిగా కూల్చివేశారు. చాలాకాలంగా ఆ స్థలంలో తిష్ట వేసిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగే ప్రయత్నం చేసినప్పటికీ హైడ్రా అధికారులు, పోలీసులు వారిని వారించి అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు.

## పోచారం డివిజన్ 8 కాంగ్రెస్ పార్టీ సమావేశం

**ఘట్‌కేసర్ రూరల్, జులై 8, ప్రభాత వార్త:** ఈ నెల పదవ తేదిన పోచారం డివిజన్ 8 వ వార్డు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం చౌదరిగూడలోని చెర్కు బాలయ్య గార్డెన్‌లో జరుగుతుందని పార్టీ నూతన అధ్యక్షుడు కర్రె రాజేశ్ బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో నూతనంగా విలీనమైన అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, ఎస్సీ ఎస్టీ సెల్, ఓబీసీ, మైనారిటీ సెల్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాల్సిందిగా కోరారు. పార్టీ డివిజన్ నూతన కార్యవర్గం ఏర్పాటుపై చర్చ, పార్టీకి సేవలు అందించేవారి వివరాల సేకరణ, పార్టీ బలోపేతానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం వంటి అజెండాతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పార్టీ శ్రేణులు సకాలంలో హాజరుకావాల్సిందిగా కోరారు.

## రైతుల అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యం

**కుల్కచర్ల,జులై 8, ప్రభాతవార్త:**నూతంగా ఎన్నికైన పిఏసిఏస్ ఛైర్మన్ బోలుసాని భీంరెడ్డికి బుధవారవ మండల కేంద్రంలోని పిఏసిఏస్ కార్యాలయంలో ఎంపిడిఓ రామకృష్ణ నాయక్,ఎంపిఓ చంద్రశేఖర్,అయ గ్రామాల ఫీల్డ్అసిస్టెంటులు, టిఎలు ఘనంగా పూలమాలలతో, శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా పిఏసిఏస్ ఛైర్మన్ బోలుసాని భీంరెడ్డి మాట్లాడుతూ..రైతన్నల వ్యవసాయంలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టేలా వారికి సలహాలు సూచనలు ఇస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడతానని అన్నారు.మండల రైతుల అభివృద్ధికి కృషి చేయడమే తమ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఏసిఏస్ వైస్ ఛైర్మన్ ఆశోక్ కుమార్, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,అయ గ్రామాల ఫీల్డ్అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.



పిఏసిఏస్ ఛైర్మన్ భీంరెడ్డిని సన్మానిస్తున్న ఎంపిడిఓ ఫీల్డ్అసిస్టెంట్లు

## నేడు పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్ రూరల్, జులై 8, ప్రభాత వార్త:** ఈ నెల 9 వ తేదిన 11 కేవీ నారపల్లి ఇండస్ట్రీయల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తు కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ. సగ్గు హరినాథ్ బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సదాశివనగర్, శివాజీ నగర్, ఓయూ కాలనీ, వెంకటాద్రీ టౌన్‌షిప్, ఎకశిలా నగర్, సుప్రభాత్ ఫేజ్ 1, చౌదరిగూడలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 11 కేవీ సంస్కతి టౌన్‌షిప్ విద్యుత్తు ఫీడర్ పరిధిలోని ఏ1 బ్లాక్ నుండి ఎ 36 వరకు పల్లవి స్కూల్ ఏరియా పరిధిలో మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మత్తు కారణంగా కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులకు కల్గుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామని ఈ మేరకు విద్యుత్తు సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఓటుతోనే ప్రజాస్వామ్యానికి బలం

**జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి**



**జవహర్‌నగర్, జులై 8, ప్రభాత వార్త:** ఓటుతోనే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలని మాజీ కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సమగ్ర ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం చంద్రపురి కాలనీ డివిజన్‌లో జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని, కొత్తగా అర్హత పొందిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్వో) అందజేయాలని తెలిపారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరికి కీలక బాధ్యత ఉందని, ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఫిష్ మార్కెట్ శంకుస్థాపనకు రండి : శ్రీకాంత్

**యాచారం,జులై 8, ప్రభాత వార్త:**

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో జూలై 10వ తేదీన ప్రతిష్టాత్మక ఎక్స్‌పోర్ట్ ఆధారిత ఫిష్ మార్కెట్ శంకుస్థాపన జరగనున్న ఈ కార్యక్రమానికి యాచారం మండల ముదిరాజ్ సంఘం నాయకులు హాజరు కావాలని రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ దూస వెంకటేష్ ముదిరాజ్ కూడా ఈ శంకుస్థాపనలో పాల్గొంటారని యాచారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నీలం శ్రీకాంత్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో యాచారం మండలంలోని ఫిషర్మెన్ సొసైటీ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు అందరూ భారీ సంఖ్యలో విచ్చేసి ఈ శంకుస్థాపన సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు



## రాజకీయ ఉనికికోసం ఆరోపణలు సరికాదు

**జిల్లెడు చౌదరిగూడ, జులై8, ప్రభాతవార్త:** రాజకీయ ఉనికికోసం ఇతరులపై ఆరోపనలు చేయడం సరికాదని జిల్లేడు చౌదరిగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు ఎంతవరకు సమంజసమని అన్నారు. గత ప్రభుత్వంలో ఐటీ కారిడార్లు, ఫార్మా సిటీలు, ఇతర ప్రాజెక్టుల పేరుతో పేద రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేసిన విషయాలు మరిచి పోయారని ఆయన అన్నారు. తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 50 కోట్ల అవినీతి చేశారంటు చేసిన ఆరోపనలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. 50 కోట్లు కాదు కదా, కనీసం 50 రూపాయలు కూడా ఆశించని స్వచ్ఛమైన రాజకీయ ప్రస్థానం శంకర్‌ది అన్నారు.

ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే నాయ కుడిపై బురద చల్లడమే ధ్యేయంగా నవీన్ రెడ్డి మాట్లాడుతున్నారు. చేతనైతే ఆధారాలతో నిరూపించాలి తప్ప, ఇలాంటి గాలి మాటలు మాట్లాడటం సరికాదని పెర్కొన్నారు. ఎన్ని విమర్శలు ఎదురైనా, ఎంతమంది కుట్రలు చేసినా నిప్పులాంటి నిజాయితీని ఎవరూ శంకించలేరు. ఆయన నిజంగా "కడిగిన ముత్యం" లాంటి నాయ కుడని అన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసం, రాజకీయ పగతో ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని తెలిపారు. ఇకనైనా నవీన్ రెడ్డి తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం



శామీర్‌పేటలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు సందీప్‌గౌడ్ తదితరులు



ఆమనగల్లులో వైస్సాఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు

**జయంతి కార్యక్రమంలో వక్తల ఉద్ఘాటన**

**శామీర్‌పేట, జులై 8, ప్రభాతవార్త :** దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ సిఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి మహా గొప్ప నాయకులు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని, పేదల అభ్యున్నతి కోసం పాటు పడిన మహా నాయకులు వైఎస్ఆర్ అని శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్ అన్నారు. బుధవారం శామీర్‌పేట కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద దివంగత మాజీ సిఎం వైఎస్ఆర్ 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సందీప్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పేద, బడుగు బలహీన వర్గాల కోసం రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆయన ఆశయాలను స్పూర్తిగ తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. శామీర్‌పేట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.అంజనేయులు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన సందీప్‌గౌడ్‌ను సన్మానించి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, వి.అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, మండల కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, టిఆర్ రవీందర్‌గౌడ్, వై.బిక్షపతి, ఎం.అంజనేయులు, ఆర్.శ్రీనివాస్, కె.బాల్‌రాం, బి.రవి, ఎస్.ఆనంద్, మేడి రవి, వాసురెడ్డి, నర్సింహ్మా, ఎస్.రాజు, ఎస్.శ్రీనివాస్, శ్రీను, అశోక్, శేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు, జులై 8, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. రాజీవ్ చౌరస్తా సమీపంలోని వైఎస్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యమ్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఆమనగల్లు, జులై 8, ప్రభాతవార్త:** సన్న వరికి రూ.500 బోనస్, ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా నిధులు విడుదల పట్ల మండల కాంగ్రెస్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. రాజీవ్ చౌరస్తాలో రైతులు, పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగంలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయరంగాభివృద్ధికి రేవంత్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ధాన్య ఉత్పత్తిలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి మానయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, ఏఎంసీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, విజయ్, కొండల్‌రెడ్డి, సర్పంచ్ ప్రశాంతిరవి, ఎంగలి ప్రసాద్, కృష్ణనాయక్, ఒగ్గుమహేష్, ఫరీద్, నాజర్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయండి**

**ఆమనగల్లు, జులై 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ మండల, పట్టణ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి, అవ్వారి శివలింగంలకు బుధవారం అభినందనలు వెల్లువెత్తాయి. మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్‌తోపాటు పార్టీ సీనియర్ నాయకులు ఇరువురులను సన్మానించి అభినందించారు. సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కలిసి కట్టుగా పనిచేసి పార్టీ మరోసారి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని ఆకాక్షించారు. ఈ



కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనరసింహ, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుర్రంకేశవులు, డిసిసి కార్యదర్శి మానయ్య, కౌన్సిలర్ అనితశ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షుడు జగన్, విజయ్, కొండల్‌రెడ్డి, ఖాదర్, ఎంగలి ప్రసాద్, కృష్ణ నాయక్, పూసల సత్యం, ఒగ్గు మహేష్ తదితరులు ఉన్నారు.



వైయస్సార్ జయంతి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు

## బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి వైయస్సార్

**యాచారం, జులై 8, ప్రభాతవార్త :**

యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ప్రియతమ నాయకులు వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి జయంతి సందర్భంగా జన్మదిన వేడుకలు ఘనంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందుకూరి బాల్ రాజ్,ఉపాధ్యక్షులు జమ్మ గుండాలు ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, మండల అధ్యక్షుడు మోటే శ్రీశైలం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి వైయస్సార్ అని కొనియాడారు. పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి అని అన్నారు. ఉచిత విద్య ఉచిత వైద్యం అందించిన ఘనత ఆయనకే సొంతమన్నారు. కాంగ్రెస్ పార్టీ హయంలోనే రాష్ట్రాల అభివృద్ధి సమగ్రవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేనిది మధుకర్ రెడ్డి, చైర్మన్ గణేష్, కాసా ఎట్టయ్య,వార్డ్ మెంబర్ మమత,ముచ్చర్ల ప్రకాష్, మక్క పెల్లి మహేష్, బూరె కుమార్, ఎరుకలి కృష్ణ, గోదాస్ రవీందర్, సంగే మధు నల్లుల గణేష్, నల్లోళ్ల జగన్,గడ్డం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మహేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పావనియాదవ్ తదితరులు

## వైఎస్ఆర్ అందించిన సేవలు చిరస్మరణీయం

**ఘట్‌కేసర్, జులై 8, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్‌లో బుధవారం బుధవారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మహేశ్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ఇటికాల బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్‌లతో పాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, నాయకులు పాల్గొని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీఎంగా పేద ప్రజలకు సేవలందించి రైతు ఋణమాఫీ, వైఎస్ఆర్ అభయహస్తం, రాజీవ్‌ఆరోగ్యశ్రీపథకం, ఇందిరమ్మ, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, 108 అంబులెన్సు, 104 ద్వారా వైద్యం తదితర పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మాజీ సర్పంచులు బద్దం గోపాల్‌రెడ్డి, మెడబోయిన వెంకటేశ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొంతం బాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, బర్ల దేవేందర్, వి.బి.వెంకటనారాయణ, మెట్టు రమేశ్, డిసిసి మాజీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మీసాల మల్లేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవరయాంజాల్‌లో వైఎస్ఆర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం

## దేవరయాంజాల్, మజీద్‌పూర్ గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాలు..నివాళులు

**శామీర్‌పేట,జులై 8, ప్రభాతవార్త :**

దేవరయాంజాల్, మజీద్‌పూర్ గ్రామాల్లో దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా చిత్రపటంకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్‌లోని మజీద్‌పూర్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి, శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎస్.జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుదాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, మాజీ ఉపసర్పంచులు టి.శంకర్‌గౌడ్, టి.బిక్షపతి, నాయకులు టి.మల్లేశ్, పి.లక్ష్మీనారాయణ, వి.మురళీగౌడ్, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## శరణుఘోషలతో మారుమోగిన అయ్యప్ప స్వామి దేవాలయం

**జవహర్‌నగర్, జులై 8 (ప్రభాత వార్త):**

స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో జవహర్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్ శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం మారుమోగింది. ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించగా, స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.తెల్లవారుజాము నుంచే గణపతి హోమం తో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం అయ్యప్ప స్వామివారికి అభిషేకాలు, హోమాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా సదాచారి గురుస్వామి నేతృత్వంలోని భజన బృందం అయ్యప్ప భక్తి గీతాలను ఆలపించింది. భక్తి గానామృతం, నృత్య ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి పోయింది. శరణు ఘోషల మధ్య భక్తులు స్వామివారిని స్మరించుకుంటూ భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు కమిటీ సభ్యులు అన్నప్రసాద (భిక్ష) వితరణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలతో జవహర్‌నగర్ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించి నట్లు తెలిపారు. ప్రతి ఏడాది వార్షికోత్స వాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, కాలనీ వాసులు, భక్తుల సహ కారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మేకల అయ్యప్ప, దేవేందర్ రెడ్డి, నరిశెట్టి కిరణ్ కుమార్.రెడ్డిశెట్టి మహేష్ గుప్తా, జమాల్పూర్ నవీన్ కుమార్, కోట్ల చెన్నారెడ్డి, శ్రీమన్నారాయణ, గుండా బిక్షపతి, సింగారం సంతోష్ గౌడ్, సుధాకర్ గౌడ్, పూజారి రాజు, కోట శ్రీనాథ్, సింగన బాల్‌రాజ్ పటేల్, రెడ్డిశెట్టి పాండురంగం, నరేష్ గురుస్వామి, సిద్ధేశ్వర గురుస్వామి, బూడిద వెంకటేష్, బోయినపల్లి నరసింహ, శ్రీశైలం గురుస్వామి, రాజశేఖర్ చారి, సదాచారి గురుస్వామి, రమేష్, మల్కారం రమేష్, పీవీఎం బ్రదర్స్ సభ్యులు, అశోక్ గుప్తా, సూడి మహేందర్, యానం కృష్ణ, సింగారం అనిల్ గౌడ్, కొండలు ముదిరాజ్, భార్గవ్ రామ్,



అంకుశాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రైతుబాంధవుడు వైఎస్ఆర్ జయంతి

ఘట్‌కేసర్, జూలై 8, ప్రభాతవార్త: మాజీ సీఎం వైఎస్ఆర్ పేదప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్, అంకుశాపూర్, ఎదులాబాద్, ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి నిర్వహించారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, పవర్‌గ్రిడ్ వద్ద దివంగత వైఎస్ఆర్ చిత్రపటానికి, అంకుశాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నాయకులు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉచిత విద్యుత్, ఆరోగ్య సేవల విస్తరణ, విద్యాప్రోత్సాహం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో వైఎస్ఆర్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని మహేశ్‌గౌడ్ కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, డిసిసి కార్యదర్శి ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, వేముల మమత, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్‌మాజీ ఇక్బాల్, ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, సొసైటీ మాజీ డైరెక్టర్లు కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, జవాజి సత్తయ్య, గాయరు విశ్వనాథం, మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి, గంగి శంకర్, మెట్టు రమేశ్, గుర్జకుంట నర్సింహ్మా, సురేశ్‌నాయక్, బింగి సురేశ్‌గౌడ్, దొంకెన శంకర్‌గౌడ్, నాయకులు కవాడి మాధవరెడ్డి, మెట్టు నర్సింహ్మా, జంగయ్యాయాదవ్, ముద్దం మల్లేశ్‌యాదవ్, మెంగ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ విత్తనాలను ప్రదర్శిస్తున్న ఏఓ లావణ్య,తదితరులు

## సబ్సిడీపై అందుబాటులో పత్తివిత్తనాలు: ఏఓ లావణ్య

**పూడూరు, జులై 8, ప్రభాతవార్త :** అర్హులైన రైతులకు సబ్సిడిపై పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మిషన్‌ఫర్ కాటన్ ప్రొడక్టివి(ఎంసిపి)లో భాగంగా మండంలోని వివిధ గ్రామాల్లో 160 హెక్టార్లకు సరిపడా 16వందల ప్యాకెట్ల రాశివారి షిప్టురకం పత్తివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ఈ విత్తనాలు క్లోజర్ స్పేసింగ్,పద్ధతి ప్రకారం విత్తుకోవాలని,ప్యాకెట్ ధర రూ.901 ఉండగా,సబ్సిడీ రూ.900పోను రైతువాటాగా ఒకరూపాయి చెల్లించాలన్నారు.రైతులకు తమ రైతువేదికల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయని,ఆయా గ్రామాల ఎఇఓలను సంప్రదించాలని సూచించారు.

## సవరణ ప్రక్రియని జయప్రదం చేయాలి

**తహాశీల్దారు విజయ్‌కుమార్**

**పూడూరు, జులై 8, ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహించే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహాశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.బుధవారం పూడూరు మండల తహాశీల్దారు కార్యాలయంలో మండలంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల బిఎల్ఎలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ 2026)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ,ఫారాల నిర్వాహణ,ఇంటింటి సర్వే,అర్హులైన ఓటర్ల నమోదు, తొలగింపులు,ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ నెల 25వతేదీలోపల ఓటరు సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసేవిధంగా సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉప తహాశీల్దారు వీరబాబు, మండల పరిషత్తు మాజీ అధ్యక్షుడు పూడుగుర్తి మల్లేశం,మాజీ సర్పంచ్ పాపయ్య,కాంగ్రెస్,బిఆర్ఎస్,బిజెపి,తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## రేపు జాబ్ మేళా..

**వికారాబాద్,ప్రభాతవార్త :** అపోలో ఫార్మసీ నందు ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎండీ.అన్వార్ సిద్దిక్యూ బుధవారం ఒక ప్రకటన తెలిపారు.జిల్లా కేంద్రంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జులై 10 శుక్రవారం ఉదయము 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అపోలో ఫార్మసీలో సుమారు 100 కు పైగా పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులు, వికారాబాద్, హైదరాబాద్ లో ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు అందరూ అర్హులని తెలిపారు. ఇట్టి ఉద్యోగానికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బి ఫార్మా, డిఫార్మ్, ఎం ఫార్మసీ విద్యా అర్హత కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఇట్టి ఉద్యోగాలు వికారాబాద్, హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ జాబ్ మేళ ద్వారా ఎంపిక అయినా వారికీ నేరుగా ఉద్యోగం కల్పించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.


VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ZULEQHA BEGUM W/o. Syed Pasha, R/o.4-2, Dudyal Village And Mandal, Vikarabad District, My Name Is Changed From ZULEQHA BEGUM To ZULEKHA BEGUM W/o. SYED PASHA.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# టిజి 20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ

**ఘట్‌కేసర్ రూరల్, జులై 8, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ యంనంపేట్ శ్రీ నిధి యూనివర్శిటీలో బుధవారం టీజీ 20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. తెలంగాణ క్రికెట్ 20 20 క్రీడాపోటీలు జరుగుతున్న సందర్భంగా ట్రోఫీని శ్రీనిధి యూనివర్శిటీ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కొరకు ట్రోఫీని యూనివర్శిటీ ఆటస్థలంలో విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ టీజీ 20 క్రికెట్ ట్రోఫీ తమ యూనివర్శిటీకి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులకు ఎంతో ప్రోత్సహంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రతినిధులతో పాటు యంకంర్ నేహా, విద్యార్థులు పాల్గొన్నారు.



యంనంపేట్ శ్రీనిధి యూనివర్శిటీ ఆటస్థలంలో విద్యార్థుల సమక్షంలో టీజీ 20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఆవిష్కరించిన దృశ్యం.

# పంచాయతీ సిబ్బంది వేతనాలు ఎప్పుడు పెంచుతారు..?



టీ. జి. పి. డబ్ల్యూ. వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షులు. టంగుటూరి.

**కొందుర్గు ,జులై 8, ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు ఎప్పుడు పెంచుతారు రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం నాడు మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ సిబ్బంది చేపడుతున్న ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కేటగిరీల వారీగా వేతనాలు పెంచడం జరిగింది. కానీ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల విధానాల గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని పంచాయతీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతు న్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కార్మిక సోదరులు ఆందోళన చేస్తే అప్పటి ప్రభుత్వం నెలకు 9,500 చొప్పున వేతనాలు పెంచిందని ఆయన గుర్తు చేశారు. బి కే యం యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది గా ఎక్కువమంది ఎస్సీ ఎస్టీ, బలహీన వర్గాల చెందిన వారే ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు జి యాదయ్య, మండల అధ్యక్షులు బి యాదయ్య., ప్రధాన కార్యదర్శి పామిడి జంగయ్య తో పాటు ఎన్ రాములు, శ్రీ జంగయ్య, రమేష్, రఫీ, సత్తయ్య, పద్మమ్మ, రంగయ్య పెద్దలు పాల్గొన్నారు. అనంతరం మండల సూపరింటెండెంట్ గణపతికి వినతి పత్రం సమర్పించారు.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొంగు బిగించిన మహిళలు

-జీవో 641 రద్దు వరకు పోరాటం ఆగదు..

-మహిళల ధర్నాకు బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంఘీభావం

**కొత్తూరు, జులై 8, ప్రభాతవార్త:** సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్, ఎకో టౌన్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సాగుతున్న ప్రజా ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళల భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ఉద్యమానికి తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమం లో పాల్గొనడం ప్రజల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా సిద్ధాపూర్ ప్రజలు చేపడుతున్న శాంతియుత ఉద్యమం రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేలా సాగాలని ఆకాంక్షి ంచారు. మహిళల ధర్నాకు తనను ఆహ్వానించిన పోరాట సమితి సభ్యులు, గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జీవో నెం. 641 పూర్తిగా రద్దు అయ్యే వరకు ప్రతి కుటుంబం నుంచి మహిళలు, యువత, రైతులు, విద్యార్థులు ఉద్యమంలో మరుసగా పాల్గొని ప్రజా పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించే వరకు ఉద్యమాన్ని శాంతియుతంగా, క్రమశిక్షణతో కొనసాగించాలని సూచించారు. ఈ ఉద్యమాన్ని సిద్ధాపూర్‌కే పరిమితం చేయకుండా పరిసర గ్రామాలకు విస్తరించి, ప్రజలందరిని ఒకే వేదికపైకి తీసుకురావాలని కోరారు.



ధర్నా నిర్వహిస్తున్న మహిళలు ,బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ,ఇతర నేతలు

జీవో నెం. 641 రద్దు కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు పార్టీ భేదాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలబడి ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.స్థానికంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు ప్రజా ప్రయోజనాల కోసం ఒకే వేదికపైకి రావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఇదే ఐక్యమత్యంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళితే ప్రజల ఆకాంక్షలు తప్పకుండా నెరవేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ట్రాన్స్‌పార్మర్ కోసం డిడిలు కట్టినా మంజూరు చేయడం లేదు

రైతుల ఆవేదన

**దోమ,జులై 8,ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం రైతులకు వెసులుబాటు కల్పించింది. ట్రాన్స్ పార్మర్లకు ఓవర్‌లోడ్ పడి విద్యుత్ సరఫరా సక్రమంగా రాకపోతే అయిదురకు రైతులు కలిసి ట్రాన్స్‌పార్మర్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వమే పొలము దగ్గర ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకోసం కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుంది.కాని దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామానికి చెందినమహిపాల్‌రెడ్డి,సత్తిరెడ్డితో పాటు అయిదు మంది రైతులు తన పొలములో కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకోసం గత సంవత్సరము క్రితం 36 వేల రూపాయలు చెల్లించి డిడిలు అందించారు.కాని ఇప్పటి వరకుట్రాన్స్ పార్మర్ మంజూరు చేయక పోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.ట్రాన్స్ పార్మర్లకు ఓవర్‌లోడ్‌పడి బోరుమోటర్లు నడవటం లేదని తెలియజేస్తున్నారు.ట్రాన్స్ పార్మర్ నుండి తక్కువ కరెంట్ సరఫరా రావడంతో స్టాటర్లు,మోటర్లు పూర్తిగా కాలి పోతున్నాయి.ఒక్కసారి కాలిపోతే వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి.పండించిన పంట బోరు మోటర్ల ఖర్చుకే సరిపోతుందని తెలిపారు.అధికారులు పరిశీలించి తమ పొలములో విద్యుత్ ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# 10న రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్

..రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలి

..ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను మానుకోవాలి

..పాఠశాలల్లో,కళాశాలల్లో సౌకర్యాలు పెంచాలి

..ఆర్ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ సతీష్‌కుమార్ డిమాండ్

..జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ సతీష్‌కుమార్,పాల్గొన్న పలువురు రాష్ట్ర, జిల్లా నాయకుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 8,ప్రభాతవార్త:**

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని రెవల్యూషనరీ స్టుడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యు) రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ సతీష్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న హాస్టల్స్‌కు పక్కా భవనాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్స్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం అమలు కోసం మెనూను పెంచాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత ఫీజును అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు పెంచి వివిధ సంస్థలకు కాకుండ మహిళా సంఘాల వారికి అప్పగించాలన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలన్నారు. ఖాళీగ ఉన్న టీచర్స్, ఎంఇఓల, డిఇఓల,లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను, ఫీజురియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, జిఓ నెంబర్లు 7,8,9లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్, గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ఆధునాతన భవనాలను నిర్మించాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులు నడపాలని, ఉచిత బస్‌పాసులు ఇవ్వాలని అన్నారు. విద్యా హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి 5లక్షల మందికి విద్యా భరోసా కార్డులు, ఉచిత ల్యాబ్‌టాప్‌లు అందించాలని అన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్స్ విక్రయాలను మూసివేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర కార్యదర్శి నాగేశ్ సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు ప్రజలు అందరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ (టిపివైఎఫ్) రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి చాకలి రాజు, రాష్ట్ర టిపివైఎఫ్ నాయకులు పురుషోత్తం, ఆర్ఎస్‌యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గురుకుల రాజు, కార్యదర్శి పి.నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల పట్ల కాంగ్రెస్ నాయకుల హర్షం

..సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**శామీర్‌పేట, జులై 8, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా నిధులు రైతుల ఖాతాలో జమచేయటం పట్ల అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇస్తుందని, రైతుభరోసాను ఒకేసారి అందించటం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, కౌన్సిలర్లు సామల జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుదాకర్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు బి.బాబు, కె.దినేశ్, జి.సాయికృష్ణ, ఎన్.రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఊరడి వెంకటేశ, గాదె యాదగిరి, తుంకి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



అలియాబాద్ రైతు వేదిక వద్ద ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్‌నాయకుల దృశ్యం

# సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**కుల్కచర్ల,జులై 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు,పిఎసిఎస్ ఛైర్మన్ బోలుసాని భీంరెడ్డి,మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు అన్నారు.

బుధవారం మండల కేంద్రంలోని రైతు ఖాతలో రైతు భరోస డబ్బులు పడ్డ సందర్భాంగా మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,రైతుల కలిసి రాష్ట్రముఖ్యమంత్రి చిత్రపట్టానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంట సాగుకు రైతులకు పెట్టుబడి సాయం కింద నిధులు విడదల చేయడం రాష్ట్ర వాప్తంగా అన్నదాలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు.



సిఎం రేవంత్ రెడ్డి చిత్రపట్టానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**ఘనంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు.....**

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నేతలు వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి ఘన నివాళలర్పించారు. అనంతరం కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు.ఈ సందర్భంగా అయన చేసిన సేవాలను కొనియాడరు.ఈ కార్యక్రమంలో ,పిఎసిఎస్‌వైస్ ఛైర్మన్ ఆశోక్ కుమార్,పాంబడ ఆలయ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి,,పిఎసిఎస్ డైరెక్టర్ అనందం,మార్కెట్ కమిటి డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి,అయా గ్రామాల సర్పంచులు, మాజి సర్పంచులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, అయ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సమతామూర్తిని దర్శించుకున్న కేంద్ర జాయింట్ సెక్రటరీ పృథుల్ కుమార్



సమతామూర్తిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్న పృథుల్ కుమార్

**శంషాబాద్ జులై 8,ప్రభాతవార్త :** కేంద్ర సమాచార, ప్రసార శాఖ జాయింట్ సెక్రటరీ పృథుల్ కుమార్ బుధవారం తన కుటుంబ సమేతంగా ముచ్చింతల్‌లోని సమతామూర్తి (స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ) నీ సందర్శించారు. 216 అడుగుల ఎత్తున్న భగవద్ రామానుజాచార్యుల విగ్రహాన్ని దర్శనం చేసుకొని సువర్ణ విగ్రహాన్ని వారు దర్శించుకుని, ప్రత్యేక పూజలో వారు పాల్గొన్నారు. అనంతరం ఆవరణలోని 108 దివ్యదేశాల నమూనా ఆలయాలను, భద్రవేదికలోని డిజిటల్ లైబ్రరీ, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. సమతామూర్తి కేంద్ర విశిష్టత, రామానుజాచార్యుల సమానత్వ సందేశం అద్భుతంగా ఉన్నాయని ఈ సందర్భంగా వారు కొనియాడారు.

# ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

**దుద్యాల్, జులై 8, ప్రభాత వార్త:** కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ ఆదేశించారు. బుధవారం వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం హకీంపేటలో నిర్మాణంలో ఉన్న ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులు మరింత వేగంగా జరిగేలా పలుకీలక సూచనలు చేశారు.

**ప్రతి బ్లాక్‌కు ప్రత్యేక పర్యవేక్షణ**

ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణాల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వొద్దని స్పష్టం చేసిన ఎన్. శ్రీధర్, ప్రతి బ్లాక్‌కు ప్రత్యేక అధికారులను నియమించి రోజువారీగా పనులను పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.

**మానవ వనరులు పెంచాలి**

నిర్మాణ పనులు వేగవంతం కావాలంటే అవసరమైన మానవ వనరులను పెంచడంతో పాటు రెండు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి పనిని ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్

ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈఓ సుధీర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, తహసీల్దార్ కిషన్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మెలుకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలి

-ఎంఎసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్

**వికారాబాద్,ప్రభాతవార్త :** వ్యవసాయ అధికారులు చెప్పే సలహాలు సూచనలు పాటించి రైతులు పత్తి సాగులో అధిక దిగుబడి సాధించాలని వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ రైతు వేదికలో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కపాస్ కాంతి) పథకం కింద 200 ఎకరాలకు గాను 800 ప్యాకెట్లు ప్రభుత్వం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు చేపట్టి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎసీ వైస్ చైర్మన్ మల్లేశం, ఏఓ ప్రసన్నలక్షి ్మ, ఎంఎసీ డైరెక్టర్ లు విజేందర్ రెడ్డి, రమేష్ నాయక్, ప్రభాకర్, నాయకులు ప్రవీణ్, విజయ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంఎసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్



## కొత్త అధ్యక్షులకు అభినందన వెల్లువ

**ఆమనగల్లు, జులై8, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ మండల, పట్టణ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి, అవ్వారి శివలింగంలకు బుధవారం అభినందనలు వెల్లువెత్తాయి. మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్‌తోపాటు పార్టీ సీనియర్ నాయకులు ఇరువురులను సన్మానించి అభినందించారు. ఈమేరకు చైర్మన్ పత్యనాయక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగంను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ సమన్వయంతో ముందుకు సాగు తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజాపాలన విధానాన్ని ప్రజలకు చేరవేయవలసిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. కలిసి కట్టుగా ముందుకు సాగుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని ఆకాక్షించారు. ఈకార్య క్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనరసింహ, మాజీ జెడ్పి టిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డిసిసి కార్యదర్శి మానయ్య, కౌన్సిలర్ అనితశ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షుడు జగన్, విజయ్, కొండల్‌రెడ్డి, ఖాదర్, ఎంగలి ప్రసాద్, కృష్ణ నాయక్, పూసల సత్యం, ఒగ్గు మహేష్ తదితరులు ఉన్నారు.



తాడిపర్తిలో సిసి రోడ్ల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న నాయకులు

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**యాచారం,జులై8, ప్రభాతవార్త:**

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలం రాము.యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామంలో నూతనంగా చేపడుతున్న సి.సి. రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నీలం రాము బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనులు జరుగుతున్నాయని, ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని ముగించాలని అధికారులను, సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బైకని సాయిలు, నీలం సత్యనారాయణ, శ్రీశైలం, ఎండి ఇసాక్, పాండు పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుభరోసా నిధులు..సిఎంకు క్షీరాభిషేకం

**ఘట్‌కేసర్, జులై 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుభరోసా' పథకం ద్వారా 68 లక్షల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.7,500 కోట్లు వేసి రైతుల పక్షపాతిగా నిలిచిందని డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌లు అన్నారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ విగ్రహానికి బుధవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు పూలమాళ వేసి నివాళులు అర్పించి రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయడంతో హర్షం వ్యక్త చేశారు. ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటి, జిల్లా ఇంచార్జ్ మంత్రి డి.శ్రీధర్‌బాబుల ఫ్లెక్సీకి నాయకులు పాలాభికం చేశారు. జైకాంగ్రెస్, రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పలు విధాలుగా తోడ్పాటును అందిస్తున్నారని పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల బాలక్రిష్ణారెడ్డి, కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మాజీ సర్పంచులు బద్దం గోపాల్‌రెడ్డి, మెడబోయిన వెంకటేశ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొంతం బాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, బర్ల దేవేందర్, వి.బి.వెంకటనారాయణ, మెట్టు రమేశ్, మీసాల సుధాకర్‌రావు, నానావత్ సురేశ్‌నాయక్, డిసిసి మాజీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మీసాల మల్లేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు ఎం.ఎం.రహమాన్, ఎం.ఎ.ఫారూఖ్, కందకట్ల మాధవరెడ్డి, మోత్కుపల్లి శ్రీనివాస్, అబ్దుల్‌ఖయ్యూమ్, బొక్క సుధాకర్‌రెడ్డి, మేకల సునీల్‌కుమార్, అశ్రఫ్‌ఆలీ,కడుపొల్ల రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.